సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

వ్యర్థాల నుంచి ఆదాయం వచ్చేలా
మున్సిపాలిటీని తీర్చిదిద్దాలి
భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, మార్చి 27 : వ్యర్థాల నుంచి ఆదాయం సమకూరేలా భూపాలపల్లి మున్సిపాలిటీని తీర్చిదిద్దాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంచినీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు, ఇండ్లలోంచి వచ్చే వ్యర్థాల సేకరణ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మంచినీటి వాల్వ్‌ల రిపేరు, బోర్‌వెల్స్ మ్యాపింగ్, ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా అంశాలపై నివేదిక అందజేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ బోర్‌వెల్స్ ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. అధికారులు ప్రతిరోజూ వార్డుల్లో పర్యటిస్తూ రోజుకు ఐదుగురి ద్వారా మంచినీటి సరఫరాపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. డ్రైనేజీల్లో వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీల ఆక్రమణలను అరికట్టాలని, నిర్మాణాలను తొలగించేందుకు సంబంధిత యాజమానులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. అయినప్పటికీ తొలగించకపోతే మున్సిపాలిటీ ద్వారా తొలగించి అందుకు అయిన ఖర్చు వసూలు చేయాలన్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు వార్డుల వారీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరించాలన్నారు. డీఆర్‌సీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలో వినియోగిస్తున్న స్వచ్ఛ వాహనాలకు ఆయిల్ వినియోగం, తిరిగిన కిలో మీటర్లపై నివేదిక అందజేయాలన్నారు. మున్సిపాలిటీలో చేపట్టిన పనులకు మంజూరు చేసిన గ్రాంటు నిధులు చెల్లించిన నిధులపై నివేదిక అందజేయాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావును ఆదేశించారు. మున్సిపాలిటీలో 71శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారని, మిగతా 29 శాతం వసూలుకు చర్యలు చేపట్టాలన్నారు. డీఫాల్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పన్నులతో సహా వసూలు చేయాలని, వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈ త్రినాథ్, ఏఈ మానస, మేనేజర్ స్వామి, డీపీవో సునీల్, ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి రూరల్ : యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కేంద్రాల ఇన్‌చార్జిలు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 189 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సుమారు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 వరకు ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి జూన్ 30 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ధాన్యం రాకుండా పటిష్ట నియంత్రణకు అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో నరేశ్, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం రాఘవేందర్, డీసీవో శైలజ, వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, మార్కెటింగ్ అధికారి కనకశేఖర్, రవాణా అధికారి సంధాని పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాటారం, మార్చి 27 : మండలంలోని దామెరకుంటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనుకుంట్ల సమ్మయ్య కుటుంబాన్ని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేష్ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీటీసీ బాసాని రవి, నాయకులు జక్కు శ్రావణ్, విఠల్ ఉన్నారు.

బీఆర్ఎస్‌దే పైచేయి..

- ధర్మం గెలిచింది.. అవిశ్వాసం వీగింది
- మంత్రి ఇలాకాలో పారని కాంగ్రెస్ పాచికలు
- తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా రామారావు కొనసాగింపు

అవిశ్వాసం వీగిన అనంతరం తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లతో కలిసి మాట్లాడుతున్న పుట్ట మధు

మల్హార్, మార్చి 27 : తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోయింది.. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఇలాకాలో కాంగ్రెస్ పాచికలు పారలేదు. ఎట్టకేలకు మండలంలోని తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి మళ్లీ చెప్యాల రామారావునే వరించింది. వివరాలిలా ఉన్నాయి.. మంథని నియోజకవర్గంలోని తాడిచెర్ల పీఏసీఎస్‌కు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏడుగురు, కాంగ్రెస్‌కు ఆరు స్థానాలు రావడంతో చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన చెప్యాల రామారావును ఎన్నుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కాంగ్రెస్ గూటికి చేరడంతో కాంగ్రెస్‌కు 8, బీఆర్ఎస్‌కు ఐదు స్థానాలు ఉన్నాయి. దీంతో గత నెలలో సింగిల్ విండో చైర్మన్‌పై కాంగ్రెస్ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించగా, ఈ నెల 26న బల నిరూపణకు జిల్లా అధికారి శైలజ తేదీ ఖరారు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారన్న ధీమాతో కాంగ్రెస్ డైరెక్టర్లు చక్రం తిప్పినప్పటికీ బల నిరూపణకు ఎవరూ హాజరుకాలేదు. దీంతో బుధవారానికి వాయిదా వేసినప్పటికీ ఎవరూ రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చుతూ విజయోత్సవ వేడుకను జరుపుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ రామారావు, డైరెక్టర్లు మల్క రాజేశ్వరరావు, మాచర్ల సురేశ్, సుంకు రాము, రాధమ్మ, తాజొద్దీన్, ఎంపీటీసీ రావుల కల్పనా మొగిలి, రాష్ట్ర యువ నాయకుడు జక్కు రాకేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, నాయకులు హరీశ్, లక్ష్మణ్‌రావు, సాంబయ్య, మల్లేశ్, రాజేశ్వరరావు, రాములు, అజ్మీరా సమ్మయ్య, మధు తదితరులు పాల్గొన్నారు. కాగా, తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం వీగిన సందర్భంగా చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలు కూడా చీదరించుకునే పరిస్థితి నెలకొందన్నారు. అధికార దాహంతో, డబ్బుతో అన్నీ కొనొచ్చని అనుకుంటే పొరపాటని, తాడిచెర్ల పీఏసీఎస్‌పై వీగిన అవిశ్వాసమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలు అమలు పర్చకపోగా, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లు పరిపాలిస్తే ఎక్కడ కూడా ప్రజల్లో వ్యతిరేకత రాలేదని, కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వ్యతిరేకత వస్తున్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులను డబ్బులు పెట్టి కొనడం కాదని, మీ పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలకు అన్యాయం చేయొద్దన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎన్నికలకు సహకరించాలి

- రాజకీయ పార్టీల నాయకులతో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ములుగు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కోడ్ ఉల్లంఘనలపై నాయకులు నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వో కార్యాలయాలతో పాటు సీ విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1950 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ మహేశ్ బాబా సాహెబ్ గీతె, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి
భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మార్చి 27 : ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్ కేసులను పరిశీలించి అధికారుల సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పాత నేరస్తులు, సమస్యాత్మక వ్యక్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. దొంగతనాల కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నేరస్తులను పట్టుకొని సొత్తు రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో భూపాలపల్లి, కాటారం వర్టికల్ డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణనాయక్,. డీసీఆర్బీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వసంత కుమార్, సీఐలు నరేశ్‌కుమార్, నాగార్జునరావు, మల్లేశ్‌యాదవ్, రాజేశ్వర్‌రావు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థుల శాతం మేరకు టీచర్లను నియమించాలి

ములుగు రూరల్, మార్చి 27 : ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థుల శాతం మేరకు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పులి సరోత్తమ్‌రెడ్డి అన్నారు. బుధవారం అబ్బాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పాపిరెడ్డి ఉద్యోగ విరమణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల అవసరాలకు మించి గురుకులాలను ఏర్పాటు చేయడానికి బదులు గ్రామాల్లోని పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలన్నారు. ఏడేళ్ల పాటు అబ్బాపురం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాపిరెడ్డి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం భాస్కర్, ఉపాధ్యాయ సంఘం నేత పద్మాకర్, ఉపాధ్యాయులు కందాల రామయ్య, సురేందర్, ప్రభావతి, రవీందర్, శ్రీధర స్వామి, రమేశ్, జ్యోతి, రాజిరెడ్డి, శ్రీనివాసాచారి తదితరులున్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

క్షయ వ్యాధికి చికిత్స పొందాలి
డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు రూరల్, మార్చి 27 : క్షయ వ్యాధి లక్షణాలతో బాధపడే వారు ప్రభుత్వ దవాఖానలను సంప్రదించి తగిన చికిత్స పొందాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ దవాఖాన నుంచి బస్టాండ్ వరకు వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు ఉండడం, సాయంత్రం సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలతో బాధపడే వారు వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవీందర్‌నాయక్, డెమో తిరుపతయ్య, డీపీఎం సమ్మయ్య, సీహెచ్‌వోలు సదానందం, శారద పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం, మార్చి 27 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమేశ్ నాయక్ కోరారు. మండల కేంద్రంలో డివిజన్ కమిటీ నాయకుడు జాగటి రవితేజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయులు ఇష్టం వచ్చినట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని, సమయ పాలన పాటించకపోవడం వల్ల విద్యార్థులు చదువులో రాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపించి వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు స్వామి, శివ కేశవ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ములుగు రూరల్, మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వం 2010 కంటే ముందు నియమితులై, 50 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపును ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీశ్‌కుమార్, మధుసూధన్ బుధవారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వీస్ ఉపాధ్యాయులకు బీఈడీ అభ్యర్థులతో సమానంగా నిర్వహించడం సమంజసం కాదని, వారికి ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. గతంతో పోల్చితే టెట్ ఫీజు ఐదు రెట్లు పెరిగినందున ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

రెండు మండలాలను భద్రాచలంలో కలపాలి

వెంకటాపురం (నూగూరు), మార్చి 27 : వాజేడు, వెంకటాపురం మండలాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. బుధవారం మండలంలోని నూగూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజన అనంతరం ఈ రెండు మండలాల ప్రజలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. సమావేశంలో నాయకులు రేగా గణేశ్, చింత మోహన్, రమేశ్, ప్రతాప్, రాజబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంఘం ఎన్నికలను రద్దు చేయాలి

ములుగు రూరల్, మార్చి 27 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నిర్వహించిన జిల్లా మత్స్య శాఖ సంఘం ఎన్నికలను రద్దు చేయాలని తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిమిత ఐక్య వేదిక అధ్యక్షుడు డోలి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అధ్యక్షులతో కుమ్మక్కైన జిల్లా సహకార, మత్స్య శాఖ అధికారులు ఈ నెల 22న రహస్యంగా ఎన్నికలు జరిపారని ఆరోపించారు. ఈ ప్రక్రియ మత్స్య శాఖ కోఆపరేటివ్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, వెంటనే రద్దు చేసి బాధ్యులైన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రమేశ్ డిమాండ్ చేశారు.

మతతత్వ బీజేపీని చిత్తుగా ఓడించాలి

కృష్ణకాలనీ, మార్చి 27 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన పదేండ్ల కాలంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు కంపేటి రాజయ్య, వెంకటేష్, రమేశ్, రాజయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

కాటారం, మార్చి 27 : మండలంలోని ఒడిపిలవంచ గ్రామానికి చెందిన పొన్న వెంకటస్వామి(70) బుధవారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అభినవ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. వెంకటస్వామి భార్య పదేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి నలుగురు కుమారుల వద్ద ఉంటున్నాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయం కాకపోవడంతో మనోవేదనతో బుధవారం ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

కాటారం, మార్చి 27 : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి అక్షయ (15) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. ఈ నెల 19న అక్షయను పదో తరగతి పరీక్ష కేంద్రానికి ద్విచక్ర వాహనంపై తండ్రి ప్రవీణ్ తీసుకొని వెళ్తుండగా కాటారం మండలం మద్దులపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి కిందపడడంతో అక్షయ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వారం రోజులుగా చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అక్షయ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో విద్యార్థిని స్వగ్రామం కొత్తపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి
18 మంది కూలీలకు గాయాలు

కన్నాయిగూడెం, మార్చి 27 : మండలంలోని ప్రధాన రోడ్డు నుంచి బుట్టాయిగూడెం పోయే మూలమలుపులో బుధవారం ట్రాక్టర్ బోల్తాపడి 18 మంది కూలీలకు గాయాలయ్యాయి. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగయ్య మిర్చి తోటలో మిర్చి ఏరేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ట్రాక్టర్ వేగంగా రావడం వల్లే మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడినట్లు స్థానికులు చెప్తున్నారు. కూలీలు ఒకరిపై మరొకరు పడడంతో 18 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సీహెచ్‌సీకి తరలించారు.

మంచినీటి సమస్యపై కంట్రోల్ రూం ఏర్పాటు

- మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్

కృష్ణకాలనీ, మార్చి 27 : భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, ఇతర సమస్యలను పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో 89781 80036 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ టీ రాజేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్ర 6 గంటల వరకు కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమస్యను చెప్తే పరిష్కరిస్తామని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని భూపాలపల్లి మున్సిలపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ అన్నారు. బుధవారం జయశంకర్ సెంటర్ నుంచి గణేశ్ చౌక్ వరకు మెప్మా సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ తీశారు. అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

- ఏఎస్పీ మహేశ్ బాబా

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేశ్

ఏటూరునాగారం, మార్చి 27 : యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడొద్దని స్థానిక ఏఎస్పీ మహేశ్ బాబా సాహెబ్ గీతే సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, వ్యసనాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా, మానసికంగా, కుటుంబ పరంగా అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల బ్రెయిన్, లంగ్స్, బ్లడ్ క్యాన్సర్‌తో పాటు గుండె పోటుకు గురై చిన్న వయసులోనే చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యసనాలకు లోనైన వారిని ప్రేమతో దగ్గరకు తీసుకుని ధైరపీల ద్వారా మార్పులు తీసుకురావల్సిన అవసరం ఉందని ఏఎస్పీ తెలిపారు. ప్రిన్సిపాల్ చిన్న మాట్లాడుతూ అనేక మంది మానసిక వ్యాధులకు గురై సైకోలుగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్సై కృష్ణ ప్రసాద్, అధ్యాపకులు విజయలక్ష్మి, రమేశ్‌కుమార్, రేణుక, ఉమారాణి, నవీన్, ఫాతిమ, జ్యోతి, మున్నీ, సంపత్, వెంకటయ్య, సురేశ్, శ్రీధర్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ వెయ్యి స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523.
NTW-321500

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఉత్పత్తిని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్, మార్చి 27: అధికారులు, కార్మికులు సమన్వయంతో పని చేస్తూ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కేటీకే ఓసీ-2 గనిని ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు చేసిన ఉత్పత్తి, బొగ్గు ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలకు గురి కాకుండా ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాలన్నారు. బొగ్గు ఉత్పత్తిలో అధికారులు చేపడుతున్న ప్రణాళికలు బాగున్నాయని అభినందించారు. కార్యక్రమ